క్లుప్తంగా

ఆర్టీసీ బస్టాండ్‌లో స్టాళ్లకు టెండర్ల ఆహ్వానం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం, కంబదూరు, ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్లలో ఉన్న స్టాళ్లను నిర్వహించడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో మేనేజర్ రామచంద్ర తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో ఆవరణలో మూడు పక్కా స్టాళ్లు, మూడు పబ్లిక్ ప్రదేశాల్లో స్టాళ్లు, కంబదూరు బస్టాండ్‌లో పక్కా దుకాణం, ఆత్మకూరు బస్టాండ్‌లో ఒకటి, ఆవరణలో ఒక దుకాణానికి టెండర్లు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గత వ్యాపారస్తులు కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో మేనేజర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బొమ్మనహాళ్: మండలంలోని సిద్దరాంపురం గ్రామంలో శనివారం ఉదయం 6.30 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ వెంకటేశులు శుక్రవారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని వారు కోరారు.

బెళుగుప్ప: మండల కేంద్రంలో శనివారం మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, ఎంపీపీ పెద్దన్న, జెడ్పీటీసీ సభ్యురాలు మమత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్బీకేల్లో ఆకస్మిక తనిఖీ

శెట్టూరు: మండలంలోని పెరగుపాళ్యం, తిప్పనపల్లి, ములకలేడు గ్రామాల్లోని ఆర్బీకేల్లో ఏడీ సంధ్యాకుమారి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. సిబ్బంది హాజరు, ఫర్టిలైజర్స్ స్టాక్, పంపిణీ రికార్డులు, పీఎం కిసాన్ ఈ–కేవైసీ పనితీరును పరిశీలించారు. రానున్న ఐదు రోజుల్లో ఈ–కేవైసీ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే రబీ ఈ–క్రాప్ నమోదును ఫిబ్రవరి నెల 15 వరకూ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఆంజనేయులు, రైతులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రాన్నం తిని ఐదుగురికి అస్వస్థత

కళ్యాణదుర్గం: పట్టణంలోని పార్వతీనగర్‌లో చిత్రాన్నం తిని ఐదుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకోగా శుక్రవారం ఉదయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల మేరకు.. పార్వతీనగర్‌లో నివాసముంటున్న అక్కులప్ప, నీలమ్మ, వారి పిల్లలు శ్రావణి, మణి, చరణ్‌తో కలసి గురువారం రాత్రి చిత్రాన్నం తిన్నారు. కొద్దిసేపటికే ఒకరి తర్వాత ఒకరికి వాంతులు, విరేచనాలు కావడంతో హుటాహుటిన కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఫుడ్ పాయిజన్ జరిగిందని నిర్ధారించి చికిత్స అందజేశారు.

వలంటీర్ నియామకం

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టు భర్తీకి చర్యలు చేపట్టారు. వలంటీర్‌గా కళావతిని నియమిస్తూ శుక్రవారం ఎంపీడీఓ భాస్కర్‌బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, సర్పంచ్ మల్లికార్జున నియామక పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్నీ గ్రామాల్లోనూ కొరత లేకుండా ప్రజాసేవ కోసం వలంటీర్లను నియమించామన్నారు.

వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం: మండలంలోని గోళ్ల గ్రామానికి చెందిన ఆదినారాయణ కళ్యాణదుర్గంలో పని ముగించుకుని శుక్రవారం ద్విచక్రవాహనంలో స్వగ్రామం వెళ్తూ పట్టణ సమీపంలోని రింగ్ రోడ్డు వద్ద లారీని తప్పించబోయి అదుపు తప్పి బోల్తాపడ్డాడు. ఘటనలో అతడి తలకు బలమైన గాయాలయ్యాయి. అతడిని హుటాహుటిన కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విధులకు సకాలంలో హాజరుకావాలి

కళ్యాణదుర్గం రూరల్: సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సకాలంలో విధులకు హాజరుకావాలని డీఎల్‌డీఓ శంకర్ హెచ్చరించారు. మండలంలోని కొత్తూరు సచివాలయాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలువురు ఉద్యోగులు విధులకు ఆలస్యంగా హాజరవడంతో..ఆయన వారిని మందలించారు. ఉద్యోగులు, వలంటీర్లు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

అతివేగంతోనే ప్రమాదాలు

బొమ్మనహాళ్: రహదారి భద్రతలను పాటించకుండా మితిమీరిన వేగంతో ప్రయాణించడంతోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని రాయదుర్గం రవాణాశాఖాధికారి విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటించాలన్నారు. హెల్మెట్ ధరించాలని హెచ్చరిస్తున్నా ద్విచక్రవాహన చోదకులు పట్టించుకోవడం లేదన్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు వహించి వాహనాలకు ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శివ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్

- 'గడప గడప'లో మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి


కళ్యాణదుర్గం రూరల్: గాజులపల్లిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్


రాయదుర్గం రూరల్: వృద్ధురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

కళ్యాణదుర్గం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా ముద్ర వేసుకున్నారని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మండలంలోని గాజులపల్లిలో శుక్రవారం మంత్రి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రిగా జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్నారన్నారు. ఇలాంటి సీఎంను, ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాల్సి అవసరం ఎంతైనా ఉందన్నారు. గత టీడీపీ పాలనకు, వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాలను గుర్తించి జగనన్నకు అండగా నిలవాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సుగుణ, పార్టీ స్పోక్స్ ప్రతినిధి తలారి వెంకటేశులు, ఎంపీపీ మారుతమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ బాలాజీ, నాయకుడు అంజి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో ఇంటింటా సంక్షేమ ఫలాలు

కుందుర్పి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం సర్పంచ్ గోవిందమ్మ మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డితో కలసి మంత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆమె ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి.. ప్రజలు అడగక ముందే అర్హతను బట్టి అధికారులే ఇళ్ల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మరోసారి జగనన్నను సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు మలయనూరు–2 అంగన్‌వాడీ సెంటర్లో గర్భిణులకు మంత్రి సామూహిక సీమంతాలు చేపట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, ఎంపీపీ కమలమ్మ, వాల్మీకి, వక్కళిగ రాష్ట్ర డైరెక్టర్లు పాలాక్షి, సుజాతమ్మ, కోఆప్షన్ సభ్యుడు ముజీవుల్లా, ఎంపీటీసీ కెంచమ్మ, ఈరన్న, ఉపసర్పంచ్ లక్ష్మీపతి, ఓబన్న, బయన్న, ఎరిస్వామి, పెద్దరాజు, నాగేంద్ర, నరశింహమూర్తి, నగేష్, తులసీధర్‌రెడ్డి, మోహన్‌బాబు, వార్డు మెంబర్లు మహేష్, నాగరాజు పాల్గొన్నారు,

మంచి చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

రాయదుర్గం రూరల్: ఎన్నికల సమయంలో మోసపూరిత మాటలు చెప్పి, గద్దెనెక్కాక వంచించే కేటుగాళ్లను నమ్మి మోసపోకుండా, మంచి చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కోరారు. మండలంలోని బీఎస్ హళ్లి గ్రామంలో శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ పుష్పావతి, సర్పంచ్ చంద్రకళతో కలసి ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మీ కుటుంబసభ్యుడిలా, తోబుట్టువులా మీ సంక్షేమం కోసం పాటుపడుతున్నారన్నారు. అలాంటి సంక్షేమ సారధికి మీరంతా అండగా నిలిచి వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని కోరారు. ప్రస్తుతం సచివాలయ , వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హుల ఇంటివద్దకే పథకాలు చేరుస్తున్నామన్నారు. అయితే రూ.లక్షలకు లక్షలు లబ్ధి చేకూరినా కరుడుగట్టిన టీడీపీ తీవ్రవాదులు మాత్రం కావాలనే అసంతృప్తి వ్యక్తం చేయడం సిగ్గుచేటన్నారు. పిల్లనిచ్చిన మామనే వెన్నుపోటు పొడిచి, పార్టీని లాక్కున్న చంద్రబాబు రాష్ట్ర ప్రజలను పలుమార్లు మోసగించాడన్నారు. అలాగే మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఇష్టారాజ్యంగా సహజ వనరులను దోచుకుని, రూ.కోట్లకు కోట్లు దాచుకున్నాడని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన ఒరగబెట్టిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మఠం సురేష్ , అరుణ్ కుమార్, సర్పంచ్‌లు ఎర్రిస్వామిరెడ్డి, కోట్ల ఉమేష్‌రెడ్డి, నాయకులు గౌని శంకర్‌రెడ్డి, బోర్‌వెల్ నాగిరెడ్డి, రేకులకుంట శివారెడ్డి, తిప్పేస్వామి, బీఎస్‌హళ్లి తిప్పారెడ్డి, రాయంపల్లి రామాంజనేయులు, నగేష్ రామప్ప, అంజి, అయ్యప్ప, తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ కొండయ్య. ఈఓపీఆర్డీ రఘురామారావు, విద్యుత్ ఏఈ బాలచంద్ర, హౌసింగ్ ఏఈ జయచంద్ర, ఏఓ మహేంద్ర, సచివాలయ సిబ్బంది , వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా ఉంటాం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడి నుంచి మా కుటుంబానికి వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా రూ.1.07 లక్షలు, జగనన్న అమ్మ ఒడి ద్వారా రూ.42 వేలతో పాటు రూ.2 లక్షల విలువచేసే ఇంటి స్థలం మొత్తం రూ.3.49 లక్షల దాకా లబ్ధి చేకూరింది. పేదలకు జగనన్న మంచి చేస్తున్నారు. జగనన్న పాలన బాగుంది. వచ్చే ఎన్నికల్లో కూడా మా మంచి గురించి ఆలోచించే జగనన్నకు అండగా ఉంటాం.

– మీనమ్మ, బీఎస్ హళ్లి, రాయదుర్గం మండలం

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ


సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత కుటుంబానికి అందిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ఉరవకొండ: వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని ఎమ్మెల్సీ స్వగృహంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును శుక్రవారం బాధితుడికి పంపిణీ చేశారు. ఉరవకొండ పట్టణంలోని గాంధీబజారులో నివాసముంటున్న చిరువ్యాపారి చిత్రాల వెంకటేష్ కొంతకాలం క్రితం తీవ్ర అనారోగ్యం బారినపడ్డాడు. కుటుంబీకులు అతడిని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా గుండె సంబంధిత శస్త్రచికిత్స అవసరమని వైద్యులు తెలిపారు. వైద్యానికి రూ.3,67,000 ఖర్చు అవుతుందని, తమ వద్ద అంత స్థోమత లేదని ఎమ్మెల్సీతో మొరపెట్టుకున్నాడు. ఎమ్మెల్సీ సూచన మేరకు ఆయన సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈక్రమంలో ప్రభుత్వం అతడి వైద్యఖర్చుల నిమిత్తం పంపిన 3,67,000 సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రమణయాదవ్, సర్పంచ్ తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

కూడేరు వీఆర్ఏ మృతి

కూడేరు: కూడేరు రెవెన్యూ వీఆర్ఏ తలారి అక్కులన్న శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మండల రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ విజయ కుమార్, వీఆర్వోలు సేతు మాధవ్, ఓబులేసు తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం తరపున అంత్యక్రియలకు రూ.25 వేల నగదును మృతుడి భార్య ఈశ్వరమ్మకి అందజేశారు.

'ఉన్నం ఫ్యామిలీ' రూ. వందల కోట్లు దోచుకుంది


కళ్యాణదుర్గం: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కంబదూరు: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం/కంబదూరు/కుందుర్పి: టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఉన్నం హనుమంతరాయచౌదరి ఫ్యామిలీ రూ.వందల కోట్లు దోచుకుందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. కళ్యాణదుర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, పార్టీ అధికార ప్రతినిధి దురదకుంట వన్నూరుస్వామి, మార్కెట్ యార్డు చైర్ పర్సన్ బిక్కి నాగలక్ష్మి, వక్ఫ్ బోర్డు సభ్యుడు షేక్షావలి విలేకరులతో మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకూ టీడీపీ నాయకులు అరాచకం చేశారన్నారు. అధికారులతో పాటు కాంట్రాక్టర్లను బెదిరించి అక్రమార్జనకు తెరలేపారని విమర్శించారు. రైల్వే కాంట్రాక్టర్లు, గాలిమరల కంపెనీల ప్రతినిధులను భయపెట్టి ధనార్జనే ధ్యేయంగా పనిచేశారన్నారు. వాటాలు ఇవ్వని వారిపై దౌర్జన్యాలకు దిగుతూ అరాచకం చేశారన్నారు. అమాయకులైన అగాపె కల్వరి చర్చి నిర్వాహకులను భయపెట్టి కోట్లాది విలువైన స్థలాన్ని కబ్జా చేసి కాంప్లెక్స్‌లను నిర్మించారని గుర్తుచేశారు. ఉన్నం హనుమంతరాయ చౌదరి ఎమ్మెల్యే కాక ముందు చిన్న వాహనంలో వచ్చేవారని, ఇప్పుడు మాజీ ఎమ్మెల్యేతో పాటు ఇద్దరు కొడుకులు విలువైన కార్లలో తిరగడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. నిజాయితీగా పనిచేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. మంత్రి అక్రమణలను నిరూపించే ధైర్యం ఉంటే బహిరంగ చర్చకు తాము సిద్ధమని సవాల్ విసిరారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు మమత, అఫ్జల్, కౌన్సిలర్ లక్ష్మన్న, నాయకులు సుధీర్, బాలా సోము, బ్రహ్మయ్య, ఉమాపతి, శ్రీకాంత్, గాజుల అంజి తదితరులు పాల్గొన్నారు.

- అధికారాన్ని అడ్డుపెట్టుకుని అవినీతి, అక్రమాలకు తెరలేపిందే మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయచౌదరి, ఆయన కుమారులు మారుతీచౌదరి, ఉదయ్‌భాస్కర్‌చౌదరిలేనని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. కంబదూరు మండల కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు, బీసీ, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవిందు, నీలి శంకరప్ప, వైస్ ఎంపీపీ భీమేష్, సర్పంచ్ సాకే గంగాధర్, నాయకులు కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, మీసేవ కుమార్, మల్లేష్, ఫయాజ్, మల్లూరి వెంకటేశులు, కిరణ్, నాగు, చంద్ర, రామక్రిష్ణ, రిజ్వాన్, దాదు విలేకరులతో మాట్లాడారు. మంత్రి ఉషశ్రీచరణ్‌పై అసత్య ఆరోపణలు,పసలేని విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు.
- మంత్రి ఉషశ్రీచరణ్‌పై టీడీపీ నాయకులు ఉన్నం హనుమంతరాయచౌదరి కుటుంబీకులు చేస్తోన్న నిరాధారమైన ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమని రాష్ట్ర వాల్మీకి, వక్కళిగ డైరెక్టర్లు పాలాక్షి, సుజాతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సవాల్ విసిరారు. శుక్రవారం వారు కుందుర్పిలో మాట్లాడుతూ ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తున్న మంత్రిపై భూవివాదాల పేరుతో ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, ఎంపీపీ కమలమ్మ, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, సర్పంచులు మమత, గంగాధర, ప్రభాకర్, గోవిందమ్మ, అతావుల్లా, కోఆప్షన్ సభ్యుడు ముజీవుల్లా తదితరులు పాల్గొన్నారు.


కుందుర్పి: విలేకరులతో మాట్లాడుతున్న డైరెక్టర్లు వైఎస్సార్‌సీపీ నాయకులు

'దుర్గం' లో తమ్ముళ్లు బరితెగింపు..!

- మాజీ మంత్రి అండతో రెచ్చిపోతున్న వైనం
- అధికారంలోకి వస్తే చంపేస్తామంటూ బెదిరింపులు

రాయదుర్గం: ప్రశాంతతకు మారు పేరుగా చెప్పుకునే రాయదుర్గంలో రాజకీయ వైరాలు రాజుకుంటున్నాయి. చిన్న చిన్న కారణాలను సాకుగా చూపుతూ వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు కొనసాగుతున్నాయి. అధికారం కోల్పోయిన నాటి నుంచి జీర్ణించుకోలేక పోతున్న తెలుగు తమ్ముళ్లు, మాజీ మంత్రి కాలవ అండతో ప్రత్యర్థులపై పగ పట్టిన పాముల్లా అవకాశం కలిగినప్పుడల్లా బుసలు కొడుతున్నారు. ఎన్నికల నాటి కక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యర్థులపై మారణాయుధాలతో దాడులకు తెగబడుతున్నారు. సాధరణ ఎన్నికలకు ఇంకా 14 నెలల గడువున్నా, అధికారంలోకి వస్తే చంపేస్తామంటూ హెచ్చరికలు జారీచేస్తూ భయంభ్రాంతులకు గురిచేస్తున్నారు. గ్రామాల్లో చిన్న పాటి ఘర్షణలు కనుమరుగైనా, కేసుల దాక వెళ్లినవి మాత్రమే బహిర్గతమయ్యే పరిస్థితులు వెలుగు చూస్తున్నాయి. గత ఆరు నెలల క్రితం కణేకల్లు మండలం జక్కలవడికి సర్పంచ్ శారదమ్మ, ఆమె భర్త వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమంతరెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి కాలవ ప్రధాన అనుచరుడైన ఎర్రిస్వామిరెడ్డి దాడికి తెగబడ్డాడు. తీసుకున్న అప్పు తీర్చమన్నందుకే విచక్షణ కోల్పోయి.. సోదరుడు రఘునాథరెడ్డితో కలసి సర్పంచ్, ఆమె భర్తపై దాడికి పాల్పడ్డ ఘటన అప్పట్లో సంచలనంగా మారింది. ఈ విషయం పై పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ నాయకుడికి మద్దతుగా మాజీ మంత్రి కాలవ కణేకల్లు పీఎస్ వద్ద ఆందోళన చేపట్టేందుకు సిద్ధపడి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. తాజాగా మెచ్చిరిలో పాలచెట్టు విషయంపై వైఎస్సార్‌సీపీ నాయకుడు నామాల చంద్రశేఖర్‌రెడ్డి వర్గంపై టీడీపీ నాయకుడు గొల్ల హనుమంతరెడ్డి వర్గం మధ్య వివాదం రాజుకుంది. వీరి మధ్య పాత కక్షలతో పాటు రాజకీయ విభేదాలు కూడా ఉండడంతో గురువారం చిన్నగా మొదలైన తగాదా ప్రాణాల మీదికి తెచ్చేలా పోరాటాలు సాగించాల్సి వచ్చింది. మాజీ మంత్రి అండ చూసుకుని వైఎస్సార్‌సీపీ వర్గీయులపై కర్రలు, కొడవళ్లు, గొడ్డలతో భీకరమై దాడులకు తెగబడ్డారు. ఓ పక్క పోలీసులు అదుపు చేస్తుంటే మరో పక్క దాడులకు యత్నించడంతో గ్రామం కాసేపు అట్టుడికి పోయింది. అధికారం లేకుండానే ఇలా చేస్తే.. అధికారం ఇస్తే ఇంకెలా ఉంటారోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

గ్రామంలో పోలీస్ పికెటింగ్


సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

మెచ్చిరి గ్రామాన్ని మొత్తం పోలీసుల ఆధీనంలోకి తీసుకున్నారు. గొడవలకు కారణమైన ప్రధాన కాలనీల్లో నాలుగు చోట్ల పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి నుంచి శక్రవారం వరకూ కళ్యాణదుర్గం డీఎస్పీ బీ శ్రీనివాసులు పర్యవేక్షించారు. ఈ ఘటనలో ఇరు వర్గాలకు సంబంధించి సుమారు 30 మంది వరకు కేసులు నమోదు చేశారు. సీఐ యుగంధర్, తహసీల్దార్ మారుతితో కలసి గొడవకు కారణమైన పాలచెట్టు ప్రాంతాన్ని పరిశీలించి పొంరబోకు స్థలంగా గుర్తించారు. చిన్న విషయంపై ఇంతలా ఘర్షణకు దిగడం సరైంది కాదని వారు హెచ్చరించారు.

సంక్షిప్త సమాచారం

పరిశుభ్రతతో వ్యాధుల నివారణ

బొమ్మనహాళ్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతాభార్గవి సూచించారు. శుక్రవారం మండలంలోని లింగదహాళ్ గ్రామంలో డెంగీ, చికెన్ గున్యా నివారణపై విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రమణ, ఎర్రమ్మ, అలివేలు, ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు శాంతలింగేశ్వర స్వామి జాతర

బ్రహ్మసముద్రం: మండలంలోని ముప్పలకుంట ముమ్మడి శాంతలింగేశ్వర స్వామి తపోక్షేత్రంలో శనివారం అనుష్టానోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కేధార్‌నాథ్ ఆలయ ఆస్థాన స్వామీజీ నాల్వడీ శాంతలింగేశ్వర స్వామి హాజరుకానున్నారు. ఉదయం కుంభాభిషేకం , రుద్రాభిషేకం, ధ్వజారోహణం , స్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఖర్చుల వివరాల పరిశీలన

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం 2021–22కి సంబంధించి నిధుల మంజూరు, ఖర్చుల వివరాలను జిల్లా అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ రహమాన్‌బాషా పరిశీలించారు. జనరల్ ఫండ్ వివరాలతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులు, ఖర్చు పెట్టిన వివరాలను తనిఖీ చేశారు. నివేదికను జిల్లా అధికారిని సమర్పిస్తామని ఆయన తెలిపారు.

ఆధార్ అనుసంధానం సులభతరం చేయాలి

కళ్యాణదుర్గం: సీఎఫ్ఎంఎస్‌కు ఆధార్‌ను అనుసంధానం చేయడాన్ని సులభతరం చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు తిప్పేస్వామి, మారెన్న కోరారు. ఈ మేరకు పెన్షనర్లు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి

కళ్యాణదుర్గం: విద్యార్థులు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని అనంతపురం ఎస్కే యూనివర్సిటీ ప్రొఫెసర్ రామ్‌గోపాల్‌వర్మ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శేషయ్య అధ్యక్షతన 'భూతాపం, వాతావరణ మార్పు' అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సూర్య నాగిరెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, జీఎల్ఎస్ ప్రసాద్, సుధాకర్, కాంతారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను అడ్డుకుందాం

కళ్యాణదుర్గం రూరల్: బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రైవేటీకరణను అడ్డుకుందామని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, పట్టణ కార్యదర్శి ఓంకార్, సహాయ కార్యదర్శి బుడేన్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. అన్ని జిల్లాల్లో ఈనెల 20నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ నెల 23న కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్నామన్నారు.27న విశాఖలో కార్మిక మహాగర్జన నిర్వహిస్తామన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు పోరాటాలు ఆగవన్నారు.

సావిత్రి బాయి పూలే ఆశయాలు కొనసాగిద్దాం

కళ్యాణదుర్గం: సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగిద్దామని ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం సావిత్రి భాయి పూలే ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించి 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికిరణ్, రాజన్న, హైమావతి, గంగిరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

గుమ్మఘట్ట: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేందుకు రైతులు కృషిచేయాలని ఏఓ నిర్మల్‌కుమార్ సూచించారు. మండలంలోని 75 వీరాపురం సమీపంలో వేరుశనగ పంటపై పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆర్బీకే సిబ్బంది, రైతులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ

కూడేరు: మండలంలోని కొర్రకోడులో ఆర్డీటీ ఆధ్వర్యంలో ప్రజల సహకారంతో రూ.12 లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించనున్నట్లు ఆ సంస్థ ఏరియా కో ఆర్డినేటర్ కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏటీఎల్ నల్లపరెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు శివలాల్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ గంగాధర్, వార్డు సభ్యుడు దివాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పప్పుశనగ పంటకోత ప్రయోగాలు

బొమ్మనహాళ్: మండలంలోని ఏలంజి గ్రామంలో శుక్రవారం పప్పుశనగ పంటకోత ప్రయోగాలు నిర్వహించినట్లు వ్యవసాయాధికారి అహమ్మద్‌బాషా తెలిపారు. రైతు తేజారెడ్డి పొలంలో 2.300 కిలోగ్రాములు దిగుబడి వచ్చిందన్నారు. కార్యక్రమంలో రిలయన్స్ ఇన్సూరెన్స్ కంపెనీ సిబ్బంది, ఏఈఓ గోపాల్, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండలంలోని ఎన్.హనుమాపురం గ్రామంలో శుక్రవారం పప్పుశనగ పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. రైతు శ్రీదేవి పొలంలో 3.30 కిలోల దిగుబడి వచ్చిందని ఏఓ శ్రవణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ బృందమ్మ, ఎంపీఈఓ లాలుస్వామి పాల్గొన్నారు.

వంద శాతం ఫలితాల సాధనకు కృషి చేయాలి

ఉరవకొండ/బొమ్మనహాళ్/శెట్టూరు: రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించే దిశగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అనంత సంకల్పం' విజయవంతం అయ్యేలా కృషి చేయాలని తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ అమృతరాజు, ఎంఈఓ ఈశ్వరప్ప సూచించారు. శుక్రవారం మండలంలోని పెద్ద కౌకుంట్ల ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమలు అవుతున్న అనంత సంకల్పం కార్యక్రమం అమలు తీరును అధికారులు పరిశీలించారు. పరీక్షలకు సమయం తక్కవగా ఉండటం వల్ల ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించేలా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను అధికారులు పరిశీలించారు. అలాగే బొమ్మనహాళ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే పదో తరగతి విద్యార్థుల శిక్షణ తరగతులను తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ తిమ్మప్ప, ఎంపీడీఓ షకీలాబేగం పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ విజయమ్మ, ప్రధానోపాధ్యాయుడు రాజ్‌కుమార్, సీఆర్‌పీలు అమరేష్, ఇస్మాయిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శెట్టూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'అనంత సంకల్పం' కార్యక్రమాన్ని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గంగావతి, ఎంఈఓ శ్రీధర్, పరిశీలించారు.

అభివృద్ధికి కృషి చేయండి

కళ్యాణదుర్గం రూరల్: అధికార, ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేసుకోవడం మానుకుని అభివృద్ధికి కృషి చేయాలని బీజేపీ నాయకులు సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బంగారు మల్లారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముప్పూరి దేవరాజు తదితరులు విలేకరులతో మాట్లాడారు.

యార్డులోనే కార్యకలాపాలు చేపట్టాలి


మాట్లాడుతున్న చైర్మన్ భోజరాజునాయక్

రాయదుర్గం: వ్యాపారాలు చేపట్టేందుకు అనువైన గిడ్డంగులు, కావాల్సినంత మైదానం ఉండే మార్కెట్‌యార్డులోనే కార్యాకలాపాలు సాగించాలని, ఈ విధానం ద్వారా ట్రేడర్స్ తో పాటు యార్డుకు ఆదాయం లభిస్తుందని కమిటీ చైర్మన్ భోజరాజ్‌నాయక్ అన్నారు. శుక్రవారం తన ఛాంబర్‌లో సెక్రటరీ సునీతతో కలసి పట్టణంలో వివిధ వ్యాపారాలు చేపట్టే ట్రేడర్స్‌తో సమావేశం నిర్వహించారు. రాయదుర్గం పరిసరాల్లో ఎక్కువ విస్తీర్ణంలో పండే వేరుశనగ కొనుగోలుకు యార్డులో ఒకే చోట కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర కల్పించేలా కృషి చేస్తామన్నారు. పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ దుకాణాలు నెలకొల్పి వ్యాపారాలు చేపట్టడం వల్ల ప్రజా రావాణా తో పాటు వ్యాపారాలకు ఇబ్బందులు తప్పవన్నారు. యార్డులో రైతులకు కావాల్సిన సౌకర్యాలన్నీ సమకూర్చే బాధ్యత తీసుకుంటామన్నారు. కొనుగోలు చేసిన వేరుశనగ నిల్వకు సైతం గిడ్డంగులను ఉపయోగించుకోవచ్చని ఆయన సూచించారు. ఇందుకు ట్రేడర్స్ నుంచి సానుకూలత వ్యక్తం కావడంతో వచ్చే ఏప్రిల్ నుంచి వేరుశనగ కొనుగోలు కేంద్రాలు తెరిచేలా కృషి చేద్దామని ఏకాభిప్రాయానికి వచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పోతక్క, ట్రేడర్స్, సిబ్బంది పాల్గొన్నారు.